ప్రజాశక్తి
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 5

పార్వతీపురం మన్యం

ఏజెన్సీలో పెరుగుతున్న వ్యాధులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో వ్యాధులు విజృంభిస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో రోగులు సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వస్తున్నారు. వస్తున్న రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. భద్రగిరిలో సిహెచ్‌సిలో రోజువారి ఒపి 200 వరకు నమోదు అవుతున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

పంట నష్టపరిహారం.. పంటల బీమా .. పంట రుణాలు.. సున్నా వడ్డీ.. కనీస మద్దతు ధర.. ఇలా వ్యవసాయ పథకాల రాయితీలు ప్రభుత్వం నుంచి రైతులు పొందాలంటే ఇ-క్రాప్ నమోదు కీలకం. ఇలాంటి ప్రక్రియ మన్యం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఇ-క్రాప్ లక్ష్యానికి చేరుకోలేదు. మరో నాలుగు రోజుల్లో గడువు ముగుస్తోంది. ఆలోపు నమోదు పూర్తికాకపోతే రైతులు అన్ని విధాలా నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది.

4 రోజులే

జిల్లాలో ఇదీ పరిస్థితి

పార్వతీపురం మన్యం జిల్లాలో 289 గ్రామ రైతు సేవా కేంద్రాల్లో 71194 మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌కు 52 శాతం మాత్రమే ఇ-క్రాప్ నమోదైంది. నియోజకవర్గాల వారీగా ఇ-క్రాప్ నమోదును పరిశీలిస్తే...

పార్వతీపురం	ఆర్‌ఎస్‌కెలు	రైతులు మొత్తం	ఇ-క్రాప్ నమోదు
పార్వతీపురం	63	24,684	55 శాతం
కురుపాం	100	23,966	52 శాతం
సాలూరు	58	14,838	67 శాతం
పాలకొండ	68	17,706	36 శాతం

- ఇ-క్రాప్ నమోదుకు దగ్గర పడుతున్న గడువు
- ఖరీఫ్‌లో వెంటాడుతున్న కష్టాలు
- ఇప్పటికీ 52 శాతం వరకే నమోదు
- ఆలస్యంతో ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-కొమరాడ

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలవుతోంది. మరో 30 రోజుల్లో సీజన్ ముగుస్తోంది. ఇప్పటికే భారీ వర్షాలతో కొన్ని పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరో వైపు ముందస్తు సాగు చేసిన పంటలు పలు ప్రాంతాల్లో కోతకు వస్తున్నాయి. అయినా రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడే ఇ-క్రాప్ నమోదుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో ఇ-క్రాప్ నమోదు 53 శాతం కూడా దాటలేదు. దీంతో ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. పంట నమోదు కాకపోవడంతో విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. పంటలతో సంబంధం లేకుండా ప్రతి ఎకరా భూమిని సర్వే నంబర్ల ఆధారంగా వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లా వ్యాప్తంగా గత ఏడాది 3,09,671 ఎకరాల భూమి ఇ-క్రాప్ నమోదు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటి వరకు 1,60,436 ఎకరాలకు మాత్రమే పంట నమోదు పూర్తయింది. ఇంకా 48 శాతానికి పైగా ల్యాండ్ పార్శిళ్లకు ఇ-క్రాప్ నమోదు కావల్సి ఉంది. ఈ నెల 30వ తేదీలోపు ఇ-క్రాప్ నమోదు గడువు పూర్తి కానుంది. దీంతో వ్యవసాయశాఖ సిబ్బంది లక్ష్యానికి చేరుకునేందుకు మల్లగుల్లాలు పడుతుండగా గడువులోపు పంట నమోదు కాకుంటే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపం

పంటల నమోదు రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా పూర్తి చేయాల్సి ఉంది. రైతులతో కలిసి పంట పొలాలకు వెళ్లి అక్కడ సాగులో ఉన్న పంట వివరాలు, 4 నంబర్ ఆన్‌లైన్లో నమోదు చేసి పూర్తిగా ధ్రువీకరణ చేసిన తరువాతే ఇ- క్రాప్ పూర్తి చేయాలి. కానీ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించింది. రెవెన్యూ సిబ్బంది ఈ ప్రక్రియకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. వివిఎలకు రైతుల భూములపై అవగాహన లేకపోవడం, విఆర్‌ఒలు సహకరించకపోవడంతో ఇ-క్రాప్ మందకొడిగా సాగుతోందని తెలిసింది. దీనికితోడు విఎఎల బదిలీల నేపథ్యంలో చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. అక్కడక్కడా కొందరు వ్యవసాయ సిబ్బంది మాత్రమే ప్రక్రియను మమా అనిపిస్తున్నారు. దీంతో ఇ-క్రాప్ నమోదులో స్పష్టత ఎంత వరకూ..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నిర్లక్ష్యం తీరిది..

మారిన నిబంధనల ప్రకారం ఈ సారి సర్వే నంబర్ల వారీగా జియో మ్యాపింగ్ చేసి, ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ తతంగం క్షేత్రస్థాయిలో పూర్తికావడానికి ఎక్కువ సమయం పడుతోంది. సాంకేతిక సమస్యలతో ముందుకు సాగడం లేదు. యూరియా కోసం రైతులు పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తుండటంతో పంపిణీ చేసేందుకు సిబ్బంది అక్కడే ఉండటం పంట నమోదుపై దృష్టి పెట్టలేక పోతున్నారు. భూములు సర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పి నంబర్లకు వ్యవసాయశాఖ సిబ్బంది దగ్గరున్న సర్వే నంబర్లకు సరిపోక పోవడంతో సమస్య ఎదురవుతోంది.

బయోమెట్రిక్ పడని రైతులకు ఐరీస్ చేయడానికి సిగ్నల్స్ సమస్య సాంకేతిక సమస్య సిబ్బందిని వేధిస్తోంది. వెబ్‌ల్యాండ్ నుంచి ప్రభుత్వ భూమి లేదా అభ్యంతరకర సర్వే ఖాతా నంబర్లు డౌన్లోడ్ అయితే వ్యవసాయేతర భూమిగా పరిగణించి నమోదు చేయాల్సి ఉంది. వెబ్‌ల్యాండ్, అటవీ భూముల్లో పంటలు ఉన్నా, లేకపోయినా ఫీల్డ్ సర్వే చేయాలి. బీడు భూములను ఐదేళ్లకు పైగా సాగు చేయనివి, 1-5 ఏళ్ల మధ్య చేయనివి, ఈ ఏడాది మాత్రమే చేయనివిగా విడదీసి చేయాల్సి ఉంది.

ఆదివాసీలను జల సమాధి చేయాలని చూస్తే

ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవు

హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక సభలో నాయకులు

మాట్లాడుతున్న ఆదివాసీ జాతీయ మంచ్ ఉపాధ్యక్షులు అప్పలనర్స

ప్రజాశక్తి-పాచిపెంట

హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం పేరిట గిరిజనులను జల సమాధి చేయాలని చూస్తూ ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండదని ఆదివాసి జాతీయ మంచ్ ఉపాధ్యక్షులు పి.అప్పలనర్స, సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు హెచ్చరించారు. మన్యం జిల్లా పాచిపెంట మండలం పరిధిలో సదాబి, తంగలం, గరిసెగుడ్డి, మూటకూడు పంచాయల్లోని సుమారు 25 గ్రామాల పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో గురువారం సతాబిలో పోరాట కమిటీ నాయకులు పి.పండు అధ్యక్షతన గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆదివాసులకు అడవులు, భూములు, నీటి వనరులపై రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కల్పించారని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల జల సమాధి చేసేలా హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మించేందుకు జీవో నెంబర్ 51 జారీ చేసిందని తెలిపారు. ఈ జీవో ఆధారంగా చింతపల్లి, కొయ్యూరు, జికె వీధి, హుకుంపేట, అరకు వ్యాలీ, అనంతగిరి, పాచిపెంట మండలాల్లో 9వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం, కార్పొరేట్, ప్రైవేటు కంపెనీలకు, సుమారు పదివేల ఎకరాల అటవీ, వ్యవసాయ భూములను మోడీ, చంద్రబాబు ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. 250 గ్రామాల్లో 50వేల మంది ఆదివాసీలు పండించే కాఫీ, మిరియాలు తదితర అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులన్నీ జల సమాధి కాబోతున్నాయని తెలిపారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆదివాసీ గిరిజన సంఘం అంగీకరించబోదని, గిరిజన ప్రజానీకాన్ని కదిలించి రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ఇప్పటికే ఆదివాసుల అరణ్య గర్జన సభ పేరుతో సెప్టెంబర్ 22న సీలేరులో జీపుయాత్ర ప్రారంభించామని, ఏజెన్సీవ్యాప్తంగా ఏడు రోజులపాటు పర్యటన చేసి 400 కిలోమీటర్ల మేర గ్రామాలను సందర్శిస్తూ ఈనెల 27న అరణ్య గర్జన సభ పేరుతో హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ, మజ్జి వలసలో సభ నిర్వహిస్తున్నామని, గిరిజన ప్రాంత ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పాల్గొంటారని తెలిపారు. తంగలం, గరిసి గుడ్డి, సతాబి సర్పంచులు ఎస్.అప్పన్న, ముఖి ఆనంద్, శిల్బజని రామయ్య, ఎంపిటిసి ప్రతినిధి చదల రాజు, పీసా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం ముందుకు వెళితే గిరిజన ప్రజానీకంతో ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని తెలిపారు. గిరిజన నాయకులు లింగమూర్తి, మార్కెట్ కమిటీ సభ్యులు ఇ.ఆనంద్, సుబ్రహ్మణ్యం, శ్రీరామ్, జె.రామయ్య, గిరిజన నాయకులు సత్యనారాయణ, సిపిఎం పాచిపెంట మండల కార్యదర్శి కె.ఈశ్వరరావు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.అప్పారావు, అల్లూరు జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు పడాల్, బాలదేవ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.శ్రీను, కోరాడ ఈశ్వరరావు, రామయ్య, అప్పలస్వామి రామస్వామి, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

సభకు హాజరైన గిరిజనులు

ఆదర్శ జిల్లాగా మన్యం

- దక్షిణ భారతదేశంలో వరుసగా రెండోసారి తొలి ర్యాంకు
- జాతీయస్థాయిలో ఆదర్శంగా నిలవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురం

దక్షిణాదిలో మొదటి స్థానంలో ఆదర్శ జిల్లాగా, ఆశావహ జిల్లాగా వరుసగా రెండోసారి పార్వతీపురం మన్యం ఎంపిక కావడం పట్ల కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సమన్వయంతో పనిచేస్తే ఏదైనా సాధ్యమవుతుందని మరోసారి అధికారులు నిరూపించారని తెలిపారు. ఇందుకు కృషిచేసిన ప్రతీ బ్లాక్ స్థాయి అధికారికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహం, నిబద్ధతతో పనిచేసి జిల్లాను జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

పూర్తిగా పివిటిజి జనాభా గల ప్రాంతంలో విద్య, ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధి, మౌలిక సదుపాయాలు వంటి 12 కీలక సామాజిక రంగ సూచికలలో ఆయా రంగాలలో నీతిఅయోగ్ పర్యవేక్షిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఆశావాహ జిల్లాలు, బ్లాక్‌లలోని సూచికలలో శత శాతం సంతృప్తిని సాధించడం ద్వారా ఈ ర్యాంకులను ప్రకటిస్తారని వెల్లడించారు.అందులో భాగంగా నీతిఅయోగ్ ప్రకటించిన జోన్ -3 డెల్టా ర్యాంకింగులో జూన్ 2025 మాసానికి మన్యం జిల్లా దక్షిణ భారతదేశంలో ఫస్ట్ ర్యాంకు సాధించిందని, ఇదే బ్లాక్ మార్చి 2024లో కూడా ఫస్ట్ ర్యాంకు సాధించి, ఇపుడు మరోసారి గెలిచి దేశంలోని అనన్యమైన రికార్డును నెలకొల్పడం అభినందనీయమని పేర్కొన్నారు.

నిరంతరం అభివృద్ధి సూచికలను పెంచుతూ మనుమకొండ ఆదర్శ గ్రామంలో ప్రత్యేక ఆకర్షణీయమైన కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడం ద్వారా ఈ రికార్డు నెలకొల్పిందని కలెక్టర్ గుర్తుచేశారు. నీతిఅయోగ్ ర్యాంకింగ్ ప్రకటించడంతోపాటు రూ.1.5 కోట్లు రివార్డును ప్రకటిస్తుందని, ఇప్పటివరకు రెండు సార్లు సాధించడం ద్వారా మొత్తం రూ.3 కోట్లు వచ్చాయని తెలిపారు. ఈ స్ఫూర్తితో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతామని కలెక్టర్ వివరించారు.

అంగన్వాడీల్లో నాణ్యమైన విద్య

విడివికెలు మరింత వృద్ధి చెందాలి : కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారితో ఆటలాడిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-సీతంపేట

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ న్.ప్రభాకర రెడ్డి ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం సీతంపేట మండలం మండ గ్రామంలో అంగన్వాడీ, విడివికె కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన విద్యార్థుల హాజరుపట్టీతోపాటు స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలతో కాసేపు ఆటలు ఆడించారు. విద్యార్థులకు మంచి విద్యను అందించాలని, వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండేలా చూసుకోవాలని సూచించారు. తక్కువ బరువు, ఎత్తు గల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, ఆరోగ్యంగా ఉండేలా చూడాలని సూచించారు. పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, అనుమానాస్పదంగా ఉంటే వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. తొలుత అదే గ్రామంలోని వన్ ధన్ వికాస కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి మహిళలు తయారుచేసిన వస్తువులను పరిశీలించారు. విడివికెలు మరింత వృద్ధి చెందాలని, గిరాకీ ఉన్న సామగ్రిని తయారుచేసి విక్రయించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ సూచించారు. విడివికెల సిబ్బందికి తగిన తర్ఫీదు ఇవ్వడం ద్వారా నాణ్యత గల సామగ్రిని అందించేందుకు వీలుంటుందని కలెక్టర్ చచెప్పారు. ఈ పర్యటనలో పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ రమాదేవి, డిఇఇ నాగభూషణం, ఎపిఒ చినబాబు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్‌లో తప్పులను సరిచేయాలి

రెవెన్యూ అధికారులను ఆదేశించిన జెసి యశ్వంత్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో రెవెన్యూ శాఖకు చెందిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి జెసి రెవెన్యూ, రీసర్వే, వెబ్ ల్యాండ్ కేసులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. మానవీయకోణంలో పరిష్కరించేందుకు కృషిచేయాలని చెప్పారు. రికార్డుల మేరకు సమస్యల పరిష్కారం ఉండాలని, పరిష్కారం కాని వాటిపై అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు.

రీ సర్వే పక్కాగా ఉండాలని తేల్చిచెప్పారు. వెబ్ ల్యాండులో ఉన్న తప్పులు సరిచేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పార్వతీపురంలో జరిగిందని, పాలకొండలో నిర్వహించాలని జెసి సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్ రెడ్డి

గర్భిణుల వసతిగృహాల సిబ్బందికి మంగళం

- ఎనిమిదేళ్లుగా వెట్టిచాకిరీ చేయించుకున్న ప్రభుత్వాలు
- టిడిపి హయాంలోనే ఆవిర్భావం
- అదే సర్కారు నిర్లక్ష్యంతో భవిష్యత్తు అంధకారం
- గిరిజన సంక్షేమ శాఖా మంత్రి జిల్లాలో దుస్థితి

ప్రజాశక్తి-పార్వతీపురం

గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య కార్యకర్త (ఫైల్)

గిరిశిఖర గ్రామాలకు చెందిన గర్భిణుల వసతిగృహాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మంగళం పాడాలని ఐటిడిఎ అధికారులు నిర్ణయించారు. నిధుల కొరత సాకుగా చూపి ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న ఎఎన్‌ఎంలు, స్వీపర్, డ్రైవర్లను విధులకు రావొద్దని అధికారులు చావుకబురు చల్లగా చెప్పేశారు. జిల్లాలోని మూడు వైటిసిల్లో గిరిజన గర్భిణుల వసతిగృహాలు నడుస్తున్నాయి. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో సాలూరు, గుమ్మలక్ష్మీపురం వైటిసిలో రెండు, సీతంపేట వైటిసిలో ఒకటి గర్భిణుల వసతిగృహాలు ఉన్నాయి. గిరిశిఖర గ్రామాలకు గర్భిణులు ప్రసవ సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఐటిడిఎ అధికారులు ఈ వసతిగృహాలకు రూపకల్పన చేశారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని రెండు గర్భిణుల వసతిగృహాల్లో 23 మంది పని చేస్తున్నారు. దాదాపు ఎనిమిదేళ్లుగా చాలీచాలని జీతంతో, ఏడాదికోసారి వేతనం ఇచ్చినా భవిష్యత్తుపై ఆశతో పని చేస్తున్నారు. ఇప్పటి వరకు వీరికి 18 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. సాలూరు గర్భిణుల వసతిగృహంలో 8 మంది ఎఎన్‌ఎంలు, స్వీపర్, డ్రైవర్ ఒక్కొక్కరు పని చేస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం వసతిగృహంలో 9 మంది ఎఎన్‌ఎంలు, ముగ్గురు స్వీపర్లు, ఒక డ్రైవర్ పని చేస్తున్నారు. ఆరు నెలలకోసారి కూడా జీతాలు అందడం లేదు. పని చేస్తున్న వారిలో 50 శాతంపైగా నిరుపేద గిరిజన కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు. మరో ఉద్యోగానికి వెళ్లలేక ఇదే జీవనాధారం అనుకుని అంకితభావంతో పని చేస్తున్న సిబ్బందికి ఐటిడిఎ అధికారులు చేదు కబురు చేరవేశారు. వీరిని నిలిపివేసి సమీపంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందితో గిరిజన గర్భిణుల వసతిగృహాలు నడిపించాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎనిమిదేళ్లు గా వెట్టిచాకిరీ

గత ఎనిమిదేళ్లుగా ప్రభుత్వాలు గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో పని చేస్తున్న సిబ్బందితో వెట్టిచాకిరీ చేయించుకున్నాయి. చాలీచాలని జీతాలిచ్చినా వదులుకోలేక ఏదో ఒక రోజు మంచిరోజులు వస్తాయని పని చేస్తున్న వారి ఆశలపై అధికారులు నీళ్లు చల్లారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పని చేయాల్సిన ఐటిడిఎ ఆ లక్ష్యానికి దూరంగా పని చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గర్భిణుల వసతిగృహాలు ఏర్పాటై ఎనిమిదేళ్లు దాటినా ఇంతవరకు వీటి నిర్వహణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమనే కనబరిచాయి. ఇవి ప్రారంభమైన ఒకటి, రెండు సంవత్సరాల వరకు బాగా నడిచినా కాలక్రమేణా వీటి నిర్వహణ ఐటిడిఎ అధికారులకు కత్తిమీద సాములా తయారైంది. వీటి నిర్వహణకు అయ్యే ఖర్చును బడ్జెట్లో చూపించకపోవడమంటే ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం పట్ల చిన్నచూపు చూడటమేనని గిరిజన సంఘాలు భావిస్తున్నాయి.

ఆవిర్భావం వెనుక

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో మొదటిసారిగా గిరిజన గర్భిణుల వసతిగృహాలు ఆవిర్భవించాయి. గిరిశిఖర గ్రామాల గర్భిణులను డోలీమోతల్లో తీసుకుని రావడంలో ఎదురైన చేదు అనుభవాల నుంచే ఇవి తెరపైకి వచ్చాయి. 2017లో సాలూరు మండలంలోని సిరివర గిరిశిఖర గ్రామం నుంచి డోలీమోతలో ఓ గిరిజన గర్భిణిని ఆమె బంధువులు మైదాన ప్రాంతానికి తీసుకొచ్చే ప్రయత్నంలో ఆమె మార్గం మధ్యలో ప్రసవించింది. తర్వాత తల్లి బిడ్డలను పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా బిడ్డ మరణించింది. ఈ సంఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి, ఐటిడిఎ పిఒ లక్ష్మీషాకి నోటీసులు జారీ చేసింది. ఆ క్రమంలోనే ఐటిడిఎ పిఒ లక్ష్మీషా గర్భిణుల వసతిగృహాలకు రూపకల్పన చేశారు. గిరిశిఖర గ్రామాల గర్భిణులను ప్రసవానికి మూడు నెలల ముందుగా వసతిగృహాలకు తీసుకొచ్చి పౌష్టికాహారం, వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేశారు. ఐటిడిఎలోని ఇతర గ్రాంట్ నిధులను వీటి నిర్వహణ కోసం మళ్లించి ఆయన ఉన్నంత కాలం బాగా నడిపించారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత నిర్లక్ష్యానికి గురైనా ఐటిడిఎ అధికారులు ఏదో ఒక విధంగా నెట్టుకుంటూ వచ్చారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత ఈ వసతిగృహాల్లో పని చేస్తున్న సిబ్బందికి మంగళం పాడారు.

మంత్రి జిల్లాలోనే...

సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత జిల్లాలోని గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో పని చేస్తున్న సిబ్బందిని నిలిపివేయాలని అధికారులు నిర్ణయించడం చర్చనీయాంశమవుతోంది. సగానికి పైగా గిరిజన పేదలే ఈ వసతిగృహాల్లో పని చేస్తున్నారు. ఐటిడిఎ అధికారుల నిర్వాకంతో 23 మంది సిబ్బంది కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉంది.

వసతిగృహాల సిబ్బందిని కొనసాగించాలి

గిరిజన మహిళలకు ఎంతో ప్రయోజనకరమైన గిరిజన గర్భిణుల వసతిగృహాల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పి.రంజిత్ కుమార్ విమర్శించారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ గర్భిణుల వసతిగృహాల నిర్వహణతో పార్వతీపురం ఐటిడిఎకి దేశ వ్యాప్త గుర్తింపు లభించిందని, యునెస్కో, నీతి ఆయోగ్ కూడా ప్రశంసలు అందించాయని గుర్తు చేశారు. అంతటి గుర్తింపు తెచ్చిన ఈ వసతి గృహాల సిబ్బందికి 40 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం విచారకరమని తెలిపారు. కోట్లాది రూపాయల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను నిర్వహిస్తున్న ఐటిడిఎ.. ఈ సిబ్బందికి జీతాలు చెల్లించడం భారంగా భావించడం సమంజసం కాదని అన్నారు. కేవలం నెలకు నాలుగు లక్షల రూపాయలు నిర్వహణను భారంగా భావించి వారిని తొలగించేందుకు సిద్ధపడడం, జీతాలు చెల్లించేందుకు నిర్లక్ష్యం వహించడం సరైన విధానం కాదని తెలిపారు. వసతి గృహాల నిర్వహణపై సమగ్రమైన విధానాన్ని రూపొందించి, ఇందులో పనిచేస్తున్న వారికి బకాయి వేతనాలు చెల్లించాలని, సిబ్బందిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కరణం త్రివేణి, అలమండ రాములమ్మ, దాసర దేవి, ఇ.నాగమణి, ఎన్.నందిని తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, గిరిజన నాయకులు

మోకాళ్లపై నిరసన

గుమ్మలక్ష్మీపురం : గిరిజన గర్భిణులకు సేవలు అందిస్తున్న తాత్కాలిక ఆరోగ్య కార్యకర్తలను కొనసాగించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు డిమాండ్ చేశారు. ఆరోగ్య కార్యకర్తలకు మద్దతుగా గిరిజన సంఘాల నాయకులు మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. ఏడేళ్లుగా గిరిజన గర్భిణులకు సేవలు అందించడంతో ఒక్క శిశు మరణం కూడా సంభవించలేదని లోవరాజు చెప్పారు. 19 నెలలుగా వేతనాలు లేకపోయినా బాధ్యతతో పని చేస్తూ వస్తున్నారని అన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించి కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థి సంఘం జిల్లా నాయకులు పల్లా సురేష్, ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణ , ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్న నాయకులు, కాలనీ వాసులు

చెత్త ట్రాక్టర్ అడ్డగింత

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ చెత్త ట్రాక్టర్‌ను ఓని గ్రామస్తులు గురువార అడ్డుకున్నారు. ఓని గ్రామ సమీపంలోని జగనన్న కాలనీ ఆనుకుని ఉన్న ప్రాంతంలో తాత్కాలిక డంపింగ్ యార్డు ఏర్పాటుచేసి, నగర పంచాయతీకి సంబంధించి చెత్తను సుమారు రెండు నెలల నుంచి వేస్తున్నారు. ఓని గ్రామానికి చెందిన వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాశ్, సమీప గ్రామమైన లుంబురు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర, జగనన్న కాలనీవాసులు గురువారం చెత్త టాక్టరును అడ్డగించారు. డంపింగ్ యార్డుతో ఇబ్బంది పడుతున్నామని, ఇక్కడ వేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఇప్పటికే అనేకసార్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, అయినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

సిహెచ్‌డబ్ల్యుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కొమరాడ

గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాలుగు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో కలిసి ఆయన మాట్లాడారు. సిహెచ్‌డబ్ల్యులకు కనీస వేతనం రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. టిఎ, డిఎలు, యూనిఫారం, గుర్తింపు కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు బి.సింహాచలం, ఎం.జయంతి, బి.శ్రీదేవి, పి.రవణమ్మ, ఎస్.భారతి, హెచ్.అనిత పాల్గొన్నారు.

పురోగతి సూచిక అవసరం

ప్రజాశక్తి కొమరాడ

పంచాయతీలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే పంచాయతీ పురోగతి సూచిక తప్పనిసరిగా అవసరమని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఎంపిడిఒ ఎస్.రమేష్ మాట్లాడారు. ప్రజాప్రతిధులు, అధికారులు సమన్వయంతో పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, ఎఎస్ఒ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మందులను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ కృష్ణ

104 సేవలపై ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మక్కువ

104 వాహనం ద్వారా అందిస్తున్న సేవలపై జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పనసభద్ర పంచాయతీ మూలవలసలో విధుల్లో ఉన్న 104 వాహనాన్ని తనిఖీ చేసి, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. సిబ్బందిని పలు వివరాలను అడిగి, అన్ని రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించారు. మందులు కొరత లేకుండా చూసుకోవాలని, వాహనాల కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. సిబ్బంది పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆపరేటివ్ ఎగ్జిక్యూటివ్ మురళీకృష్ణ, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడిని సత్కరిస్తున్న హిందీ ప్రచార సభ ప్రతినిధులు

అచ్చెన్నను కలిసిన హిందీ ప్రచారసభ బృందం

ప్రజాశక్తి-పాలకొండ

హిందీ ప్రచారసభ ప్రతినిధులు గురువారం వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును అమరావతిలో కలిశారు. ప్రచార సభ కేంద్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి ఆధ్వర్యాన రాష్ట్రంలో హిందీ భాషాభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రికి వినతిపత్రం అందించారు. వారి వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రతినిధులు చొంగ శివానంద్, ఇంతియాజ్ మంత్రిని శాలుశా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. హిందీ ప్రచారసభ ప్రత్యేక హిందీ పత్రికను మంత్రికి బహూకరించారు. మంత్రికి హిందీ ప్రచార సభ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో హిందీ భాషాభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడుకు హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులు సి.ఎల్.నాయుడు, ప్రచార కార్యదర్శి కోనే శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా పంపిణీ చేస్తున్న పిఎసిఎస్ చైర్మన్ కిశోర్

రైతులందరికీ యూరియా

ప్రజాశక్తి - కురుపాం

రైతులందరికీ యూరియాను అందించడమే పిఎసిఎస్ లక్ష్యమని పిఎసిఎస్ చైర్మన్ డొల్లు కిశోర్ అన్నారు. గురువారం కురుపాం పిఎసిఎస్‌లో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా లేదంటూ ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని తెలిపారు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో మండలంలో రైతులందరికీ యూరియా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ కె.నాగేశ్వరరావు, పిఎసిఎస్ సెక్రెటరీ మోహన్ రావు, మండల కన్వీనర్ కొండయ్య, రైతులు పాల్గొన్నారు.

28న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-సాలూరు

భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఈ నెల 28న సాలూరులోని సీతారామ కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మీకై మేము సంస్థ అధ్యక్షులు ఇప్పిలి దిలీప్ కుమార్ తెలిపారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత.. మనందరి బాధ్యత

ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛతలో పాల్గొన్న కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యతని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. దీని ద్వారా పరిసరాలు అందంగా కనిపించడంతో పాటు ఆరోగ్యంగా ఉంటామన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణ పరిధిలోని 8వ వార్డులోని కొత్తవలస చెరువు వద్ద స్వచ్ఛత హి సేవ -2025లో భాగంగా ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. దీనిలో జిల్లా కలెక్టర్ పాల్గొని శ్రమదానం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, కమిషనర్ జి.శ్రీనివాసరాజు భాగస్వామ్యమై శ్రమదానం చేసి చెరువు పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3వ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 10 రోజుల పాటు శ్రమదానం కార్యక్రమం నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండగలమని, అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా చెత్తబుట్టలో వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, కమిషనర్ జి.శ్రీనివాసరాజు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ రత్నంరాజు

కురుపాం : అధికారులంతా ప్రతి గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొవాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, తహశీల్దార్ కె.జయ అన్నారు. ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్త చెదారాలను తమ సిబ్బందితో కలిసి తొలగించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జి.రమేష్‌బాబు, హెచ్‌డిటి సురేష్ కుమార్, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : పరిసర ప్రాంతాలలను స్వచ్ఛంగా ఉంచుకుంటే ప్రజలంతా ఆరోగ్యకరంగా ఉంటారని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. గురువారం మండలంలోని పరశురాంపురం తదితర పంచాయతీల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలకొండ : పట్టణంలో కోట దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో నగర పంచాయతీ సిబ్బంది గురువారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రత్నంరాజు మాట్లాడుతూ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కూడా అందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి అడపా బాబ్జినాయుడు, అడ్మిన్ కార్యదర్శి రాధా కుమారి, తదితరులు పాల్గొన్నారు

పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

కోనేరు పనుల ఖర్చుపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీలో వెంకటరాయుని కోనేరు పనుల్లో గత ప్రభుత్వ హయాంలో రూ.23.27 లక్షలు ఖర్చు చేశారని, ఇందులో పూర్తిగా అవినీతి జరిగిందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆరోపించారు. గురువారం శాసనసభలో ఆయన మాట్లాడారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆయన కోరారు.

జిఎస్‌టి ఉపసంహరణ గొప్ప విజయం

ప్రజాశక్తి-పార్వతీపురం

దేశ వ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయ సమీకరణ ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియాలపై అమల్లో ఉన్న 18 శాతం జిఎస్‌టిని ఉపసంహరించుకుందని ఆలిండియా బీమా ఉద్యోగుల సంఘం పార్వతీపురం బేస్ యూనిట్ ప్రధాన కార్యదర్శి టెక్కలి ధర్మారావు చెప్పారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ఈ నెల 22 నుంచి నుంచి అమల్లోకి వచ్చిందని చెప్పారు. 2004 నుంచి ఆలిండియా బీమా ఉద్యోగుల సంఘం నిరంతర పోరాటం చేస్తోందని చెప్పారు. దశలవారీ పోరాటాలతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం ద్వారానే జిఎస్‌టి ఉపసంహరణ సాధ్యమైందని చెప్పారు. దేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 400 మంది ఎమ్‌పిలను కలిసి జిఎస్‌టి ఉపసంహరణ ఆవశ్యకత గురించి వివరించినట్లు తెలిపారు. దీనివల్ల కొంత ఉపశమనం కలిగించినా ఎల్ఐసి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్తులో తీవ్ర పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

ఎస్‌పి మాధవరెడ్డి

సమీక్ష నిర్వహిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్‌పి మాధవరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాసాంతపు నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గంజాయి వ్యాపారాలతో ఆస్తులు కూడబెట్టే వారిని గుర్తించి, వారి ఆస్తులను అటాచ్ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తరుచుగా నేరాలకు పాల్పడే నిందితులపై హిస్టరీ షీట్లు తెరవాలన్నారు. డ్రోన్ పోలీసింగ్ నిర్వహించాలని చెప్పారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం నిర్మూలించడానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఉక్కు పాదం మోపాలన్నారు. ఇ-చలానా, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఎక్కువగా నమోదుచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, డిసిఆర్‌బి సిఐ ఆదాం, సోషల్ మీడియా,సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు, సిసిఎస్ సిఐ అప్పారావు, ఎస్‌బి సిఐ రమేష్, ఎఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు, ఎఒ సతీష్ బాబు, పి.సూపరింటెండెంట్ శంకరరావు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న ఎస్‌పి

పాలకొండ : పట్టణంలో కోటదుర్గమ్మ ఆలయాన్ని ఎస్‌పి మాధవరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ పూజలు నిర్వహించారు. ఆయన వెంట డిఎస్‌పి రాంబాబు, సిఐ ప్రసాదరావు, ఎస్ఐ ప్రయోగమూర్తి ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

డిఆర్‌ఒ కె.హేమలత

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ఆవశ్యకతను గమనించిన చోటల్లా రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలని డిఆర్ఒ కె.హేమలత గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఆమె ఛాంబరులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లో 800 నుండి 1200 మంది ఓటర్లు ఉండేలా, ప్రతి ఓటరు నివాసం నుండి 2 కిలోమీటర్ల దూరంలో పోలింగ్ స్టేషన్లు ఉండేలా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. అందులో భాగంగా రాజకీయ పక్షాల దృష్టిలో ఉన్న వివరాలు తెలియజేయాలని అన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు సంబంధించి ప్రతి ఇఆర్ఒ వచ్చే రెండు నెలల్లోపు పోలింగ్ స్టేషన్లను విలీనం చేయడం/ఓటర్లను సమీప పోలింగ్ స్టేషన్‌లకు మార్చడం ద్వారా వివరణాత్మక కసరత్తు చేపట్టాల్సి ఉందన్నారు. ఓటర్ల జాబితాలకు సంబంధించిన సూచనలు, ఎన్నికల రోల్స్ నాణ్యత, స్వచ్ఛతను మరింత మెరుగుపరచేందుకు సహకరించాలని చెప్పారు. 2002 ఎన్నికల జాబితాను 2025 డేటాతో మ్యాపింగ్ చేయడం, జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఈ ప్రక్రియ జరగనుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు వంగల దాలినాయుడు, జి.శివ, పి.శ్రీనివాసరావు, ఎ.పేర్రాజు, ఎల్.నారాయణరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-సీతంపేట

అచ్చభ గ్రామంలో ఇటీవల చెరువులో పడి మరణించిన అంజలి, మౌనిక కుటుంబాలను టిడిపి నాయకులు గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చందరరావు, మండల అధ్యక్షులు సవరతోట ముఖలింగం, నాయకులు బిడ్డిక దమయంతి నాయుడు, సవర మాలయ్య, నిమ్మక కృష్ణారావు పాల్గొన్నారు.

మిశ్రమ పంటలు పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని గుచ్చిమి గ్రామంలో మిశ్రమ పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసర, మినుము, కంది పంటలో మిశ్రమ పంటల ద్వారా రైతులు అధిక దిగుబడులు పొందొచ్చని వివరించారు. ఆరుతడి పంటలు ఎక్కువ పండిస్తే అధిక దిగుబడి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

రైతుల సమస్యలకు పోరాటాలతోనే పరిష్కారం

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-బలిజిపేటరూరల్

పోరాటాలతోనే రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం బలిజిపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం మండల మహాసభ గంట్యాడ బలరామనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎం.కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వ సహాయం అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధరను ప్రకటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తాజాగా రైతుకు యూరియా అందుబాటులో లేకుండా ఇబ్బందులు పెట్టాయని దుయ్యబట్టారు. బ్యాంకుల నుండి రుణాలు లేక ప్రయివేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి రైతులు దివాలా తీస్తున్నారని వాపోయారు. ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలంటే రైతాంగం యావత్తూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం 13 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మండల గోవింద, కార్యదర్శిగా ఆవు సాంబమూర్తి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్ల ఈశ్వరరావు, అక్కపోలు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోతులను పూడ్చాలి : సిపిఎం

ప్రజాశక్తి-కొమరాడ

ఆంధ్రా-ఒడిశా అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చాలని సిపిఎం జిల్లా నాయకులు కె.సాంబమూర్తి అధికారులను డిమాండ్‌చేశారు. అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతుల వద్ద సిపిఎం, టిడిపి ఆధ్వర్యాన గురువారం జెండాలను ఏర్పాటుచేసి, ప్రమాదాల నివారణకు చిరు ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుండి కూనేరు వరకు ఉన్న 36 గోతులను వెంటనే పూడ్చాలని కోరారు.

గోతుల వద్ద జెండాలను ఏర్పాటుచేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలివ్వాలి

ప్రజాశక్తి-బలిజిపేట రూరల్

డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, వేధింపులు ఆపాలని శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి వి.ఇందిర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బలిజిపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఐద్వా మండల మహాసభను యు.లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ సమాజంలో సగభాగం మహిళలని చెప్పిన పాలకులు.. వారికి సరైన న్యాయం చేయడం లేదన్నారు. ప్రస్తుతం బ్యాంకులు మహిళలు కడుతున్న వడ్డీల మీదే ఆధార పడి నడుస్తున్నాయని చెప్పారు. బ్యాంకులో అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని అన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి మహిళలు అధిక వడ్డీలకు అప్పులు వాడి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సంస్థల వేధింపుల నుండి మహిళలను రక్షించాలని డిమాండ్ చేశారు. బెల్ట్‌దుకాణాలను అరికట్టాలని డిమాండ్‌చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా యు.లక్ష్మి, వై.సుధా, ఎల్.కళావతిని ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి ఇందిర

ఎస్ఎన్ఎస్‌పిఎను వినియోగించుకోవాలి



కురుపాం.. రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్‌పి ప్రదీప్ చంద్రదేవ్

ప్రజాశక్తి - కురుపాం

మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్‌పి వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్ అన్నారు. గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ కె.సందీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తన పుట్టినరోజున రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని కోరారు. అనంతరం సూపరింటెండెంట్ సందీప్ కుమార్ మాట్లాడుతూ మెగా వైద్య శిబిరానికి 332 మంది రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేసుకున్నారని తెలిపారు. 20 మంది రక్తదానం చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వారపు సంతలో వైద్య శిబిరం

కురుపాంలో వారపు సంతలో గురువారం రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి చీకటి శంకరరావు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రజలు ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో వైద్య శిబిరం

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేటలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన గురువారం ఎస్ఎన్ఎస్‌పిఎ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉషారాణి మహిళలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్‌వి రమణ, సూపర్వైజర్ ఎవి రవణమ్మ, సర్పంచ్ వి.తాతబాబు, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉషారాణి

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కంబర పంచాయతీ పరిధి కాగితాడ గిరిజన గ్రామానికి చెందిన లింగందొర రమేష్(33) బుధవారం రాత్రి గ్రామ సమీపంలో టేకు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. రమేష్ బతుకు తెరువు కోసం 9 నెలల కిందట అనకాపల్లిలో ఓ చికెన్ షాప్‌లో పని చేసేవాడు. సీతంపేట మండలం బర్న సీతంపేటకు చెందిన వివాహితతో పరిచయమై, వినాయక చవితి పండుగకు స్వగ్రామానికి తీసుకొచ్చాడు. ఇద్దరి మధ్య చిన్న తగాదాలు ఏర్పడి రమేష్‌పై ఆమెకు అనుమానం వచ్చింది. తన మృతికి కారణం ఆమె అంటూ సెల్ ఫోన్‌లో మెసేజ్ చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. రమేష్‌కు తల్లిదండ్రులు సత్యం దొర, సోములమ్మ ఉన్నారు. తండ్రి సత్యందొర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

సరిహద్దు గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు

ప్రజాశక్తి - కురుపాం

ఎబి గ్రామాలైన సందుబడి, తంబలబాయి, రేగులపాడులో సారా తయారీ స్థావరాలపై కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఆంధ్రా, ఒడిశా ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ 9,700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. 730 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సారా తయారీ, అమ్మకాలు చేసే వారి సమాచారాన్ని 6302936599 ఫోన్ నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.

కొండచిలువ హల్ చల్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో గురువారం ఉదయం కొండ చిలువ హల్‌చల్ చేసింది. రావాడ జంక్షన్‌లో ఉన్న షేక్ నూరెల్లా చికెన్ షాప్ వద్ద రాత్రి సమయంలో చేరుకొని కోళ్లను తినేసింది. రావాడ జంక్షన్ సమీపంలోని లంకెల చెరువు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉండడంతో సమీప కాలనీవాసులకు, షాపుల యజమానులకు నిత్యం పాములు బెడద తప్పడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రాత్రి సమయంలో పాములు తిరుగుతుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నామని చెప్పారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చెరువులో ఉన్న పాములను దూరప్రాంతాలకు తీసుకువెళ్లి విడిచి పెట్టాలని కోరుతున్నారు.